నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 7-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 165 | పేజీలు:4 | వెల: రూ.1/-

తొండుపల్లిలో కిడ్నాప్‌కు గురైన

చిన్నారి క్షేమం

రంగారెడ్డి, ఫిబ్రవరి 6: సైబరాబాద్ కమిషనరేట్ శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నారి కిడ్నాప్ ఘటన కలకలం సృష్టించింది. శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరధిలోని తొండుపల్లి గ్రామంలో సోనూకుమార్ అనే వ్యక్తి రెండేళ్ల కూతురు శిల్పి కిడ్నాప్‌నకు గురైంది. బాధిత తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. పాపను ఎత్తుకెళ్లింది ఓ ఆటోడ్రైవర్‌గా గుర్తించారు. పాపను సురక్షితంగా రక్షించి ఆటోడ్రైవర్ సందీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జనసంద్రంగా మేడారం జాతర

మేడారం,ఫిబ్రవరి6(నేటినిజంప్రతినిధి): తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు జనం పోటెత్తారు. వేలాదిగా వాహనాల్లో ప్రజలు తరలివస్తున్నారు. జంపన్నవాగులో స్నానాలు చేసి అమ్మవారి గద్దెలను దర్శించుకుంటున్నారు. ప్రతి ఏటా ఈ జాతరకు దేశం నలుమూలల నుంచి లక్షల్లో భక్తులు వస్తుంటారు. ప్రతి ఏడు లాగే ఈ సారి కూడా మేడారం జాతరకు భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన మేడారం జనసంద్రంలా మారింది. జంపన్న వాగులో పుణ్యస్నానాలాచరించిన అనంతరం అమ్మవారికి ఎంతో ప్రీతి అయిన బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇప్పటికే గద్దెలపైకి చేరుకున్న సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు చేరుకోగా ఇవాళ సాయంత్రం సమ్మక్క చేరుకోనుంది. ప్రస్తుతం గద్దెల వద్ద క్యూలైన్లలో భక్తులు

భారీగా తరలివస్తున్న ప్రజలు గద్దెలవద్ద మొక్కులకు క్యూ

బారులు తీరి ఉన్నారు.

ఇక ఇవాళ సాయంత్రం సమ్మక్క రాకకోసం జిల్లా అధికార యంత్రాంగం చిలకలగుట్ట వద్ద వేచి ఉంది. చిలకలగుట్ట నుంచి సమ్మక్క పూజారులు కుంకుమ భరిణెను తీసుకోని కిందకు వస్తున్న సమయంలో జిల్లా ఎస్‌పి గాల్లోకి కాల్పులు జరుపుతారు. ఈ శబ్దాలే సమ్మక్క రాకకు సంకేతాలు. భారీ బందోబస్తు నడుమ అమ్మవారి కుంకుమ భరిణె చిలకలగుట్ట నుంచి గ్గదెల ప్రాంగణానికి తీసుకువస్తారు. ఇక అప్పుడు అసలు మేడారం జాతర మొదలౌతుంది. ఆ మరుక్షణం నుంచి భక్తులు మొక్కుల చెల్లింపులు ప్రారంభమవుతాయి.

గద్దెలపైకి చేరిన సారలమ్మ

అమ్మవారితోడుగాపగిడిద్దరాజు, గోవింద రాజు భారీగా తరలి వస్తున్న భక్త జనం పటిష్ట ఏర్పాట్లతో ఇబ్బందులు లేకుండా చర్యలు గద్దెలను దర్శించుకుని పులకిస్తున్న జనప్రవాహం

మేడారం,ఫిబ్రవరి6(నేటినిజంప్రతినిధి)): మేడా ం టం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. పగిడిద్దరాజు, గోవిందరాజుతో కలిసి మేడారం గద్దెల పైకి సారలమ్మ చేరుకోవడంతో భక్తులు పులకరించారు. దండాలు పెట్టి పరవశించారు. అమ్మవారికి మొక్కి ఆనందించారు. తండోపతండాలుగా తరలివచ్చిన జనం క్రమశిక్షణగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని జన్మ ధన్యమైందని భావించారు. భారీ పోలీసు బందోబస్తు, గిరిజనుల రక్షణ మధ్య అర్ధరాత్రి 12:30 గంటలకు గద్దెలపైకి అమ్మ సారలమ్మ చేరుకుంది. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా భక్తులకు అమ్మవారు దర్శనమిస్తోంది. అమ్మవారి రాకతో రాత్రంతా భక్తులు దర్శనం చేసుకున్నారు. కొమ్ముబూరలు, డోలు వాయిద్యాలు మార్మోగంగ.. శివసత్తుల పూనకాలతో అడవితల్లి పరవశించంగ.. ఆడబిడ్డలంతా వరం పట్టంగ.. అమ్మలగన్న అమ్మ సమ్మక్క బిడ్డ సారలమ్మ కన్నెపల్లి నుంచి పసుపు, కుంకుమ రూపంలో మొంటెలో కదిలివచ్చింది. తోడుగా పగిడిద్దరాజు, గోవింద రాజు తరలివచ్చారు. సారలమ్మతోపాటు గద్దెలనెక్కారు. ఈ ఘట్టాన్ని చూసేందుకు వచ్చిన జనంతో వనమంతా భక్తజన సంద్రమైంది. బుధవారం రాత్రి ఆడబిడ్డ సారలమ్మ రాకతో నాలుగురోజుల మేడారం మహాజాతర షురువైంది. గురువారం చిలుకలగుట్ట నుంచి తల్లి సమ్మక్క కూడా కదిలిరానుంది. మేడారం జాతరలో మరో అద్భుత సన్నివేశం సమ్మక్క గద్దెపైకి చేరే ఘట్టం గురువారం జరుగనుంది. సమ్మక్క ప్రధాన పూజారులు, వడ్డెలు మేడారం సమీపంలో ఉన్న సమ్మక్క ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తర్వాత సాయంత్రం చిలుకలగుట్టపై నుంచి సమ్మక్కను తీసుకువచ్చేందుకు వెళ్తారు. భక్తులు ఎదురేగి స్వాగతం పలుకుతుండగా.. సమ్మక్కను భరిణె రూపంలోగద్దెల వద్దకు తెచ్చి ప్రతిష్టిస్తారు. అమ్మలు గద్దెలపైకి చేరుకోవడం పూర్తవడంతో గురువారం రాత్రి నుంచి భారీ సంఖ్యలో భక్తులు మేడారం చేరుకుని మొక్కులు చెల్లించు కుంటారు. మేడారం పోలిమేరలోకి సారలమ్మ రాగానే ఆహ్లాద వాతావరణం వెల్లివిసింది. అప్పటికే పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరా జులు తరలివచ్చారు. ఈ ఇద్దరు సారలమ్మ ఎదురు చూస్తున్న తరుణంలో మేడారానికి సారలమ్మ వచ్చిందన్న సంకేతంలో గద్దె ప్రాంగణం సందడిగా మారింది. సారలమ్మ మేడారం గుడిలోకి చేరగానే ఆదివాసి సంప్రదాయ విన్యాసాలతో డోలి మోతలు, కొమ్ము బూరల నాదాలతో మేడారం దద్దరిల్లాయి. ప్రత్యేక పూజలు ముగిసిన తర్వాత ముగ్గురు కలిసి మేడారం గ్గదెల ప్రాంగణానికి బయలుదేరారు. అర్ధరాత్రి సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. అదే విధంగా పగిడిద్దరాజు, గోవింద రాజులు వారి వారి గ్గదెలపై ఆసీనులయ్యారు. కాగా, గద్దెదెలపైకి చేరుకున్న సారలమ్మకు ఎమ్మెల్యే సీతక్క, కలెక్టర్ కర్ణన్, డీఆర్వో రమాదేవి స్వాగతం పలికారు. సారలమ్మను తోడ్కొని వచ్చేందుకు ఆదివాసీ యువత, తుడుందెబ్బ, సారలమ్మ యువజన సంఘం ప్రత్యేక వలయాలుగా మారి తమ ప్రాణపథంగా భావించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. తుడుం దెబ్బ సహా పలు ఆదివాసీ సంఘాలు త్రివలయ విధానంతో సారలమ్మకు రక్షణగా నిలిచారు. పోలీసులు సైతం రెండు రోప్ పార్టీలను ఏర్పాటు చేయడమే కాకుండా రోడ్ క్లియరెన్స్ పార్టీలతో ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

పుణ్యస్నానాలతో పులకిస్తున్న జంపన్న వాగు

కన్నెపల్లి నుంచి జంపన్నవాగు దాక ఒక దృశ్యం.. జంపన్నవాగు నుంచి మేడారం వరకు మరో దృశ్యం. ఈ రెండు దృశ్యాల మధ్య జంపన్నవాగు ఒక్కసారిగా కో..కో.. రాగాలతో ఓలలాడింది. ఉప్పొంగిన జంపన్న అక్క కాళ్లు కడిగి నెత్తిన చల్లకున్నాడా.. అన్నంత ఉద్విగ్న వాతావరణం నెలకొంది. బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు మేడారం ఎటు చూస్తే అటు జనవర్ణమైంది. సారలమ్మ మేడారానికి బయలుదేరిందన్న సమాచారం తెలుయగానే మేడారం జాతర ప్రాంగణం నుంచి భక్తులు తండోప తండాలుగా కన్నెపల్లికి పరుగులు తీశారు. గుడి నుంచి బయటికి రాగానే సారలమ్మ కన్నెపల్లి వాడవాడ తిరగుతూ బిడ్డలకు దీవెనలిచ్చింది. ఇల్లిల్లూ సారలమ్మకు చీరె, సారె పోసి కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన చల్లుకుంది. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం అత్యంత నియమ నిష్టలతో ఉ దయం నుంచి ఉపవాసం ఉన్న ఉన్న ప్రధాన వడ్డె కాక సారయ్య అధ్వర్యంలో సారలమ్మ మేడారం గ్గదెకు పయనమైంది. కన్నెపల్లి నుంచి మేడారానికి దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా దారికి ఇరువైపులా జన సందోహం పోటెత్తింది. శిగాలూగే శివసత్తుల పూనకాలతో జాతర మార్మోగింది. ఎదురుకోళ్లు సమర్పిస్తూ ఒడిబియ్యం చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ జనం సారలమ్మకు నీరాజనం పలికారు.

మేడారంలో దేవతలు కొలువుదీరిన గద్దెలు, అమ్మవారికి సమర్పించే బంగారం బెల్లం ముద్దలతో గద్దెలపద్దకు బయలుదేరిన భక్తులు

మేడారంలో ఆదివాసీ మ్యూజియంను సందర్శించిన మంత్రి సత్యవతి

మేడారంలో పర్యటించిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6: మేడారంలో బస చేసిన గిరిజన సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్.. ఇవాళ అక్కడ ఆదివాసీ మ్యూజియంను సందర్శించారు. సమ్మక్క – సారలమ్మ వాడిన కత్తులు, వస్తువులు, నాటి దుస్తులు, సంప్రదాయాలు, జీవన విధానాన్ని పరిశీలించారు.

అనంతరం జంపన్న వాగు దగ్గర వసతులను ఆమె పర్యవేక్షించారు. ఆ తరవాత మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, జడ్పీ చైర్మన్ జగదీశ్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా, సీపీ రవీందర్, కలెక్టర్ కర్ణన్, ఇతర అధికారులు కలిసి మేడారంలో భక్తులకు వసతులు, శాంతి భద్రతలపై సమీక్ష జరిపారు. సమీక్ష అనంతరం మేడారం గద్దెల వద్ద ప్రధాన రహదారి పై దుకాణాల్లో పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నివారణ పై పర్యవేక్షించారు. పరిశుభ్రత పాటించని దుకాణాలు మూసి వేయాలని అధికారులకు ఆదేశించారు. అక్కడి నుంచి నేరుగా సీఎం కేసీఆర్ గారు రేపు మేడారం రానున్న సందర్భంలో సీఎం వసతి, బస, హెలిప్యాడ్ ప్రదేశాలని తనిఖీ చేశారు. హెలికాప్టర్ లో ఎక్కి మేడారంలో భక్తుల సౌకర్యాలు, క్యూ లైన్ లను విహంగ వీక్షణం చేశారు.

కర్ణాటకలో మంత్రి వర్గ విస్తరణ

బెంగళూరు, ఫిబ్రవరి 6 : కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ జరిగింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యెడియూరప్ప.. మరో పది మంది ఎమ్మెల్యేలకు మంత్రులుగా చోటు కల్పించారు. నూతన మంత్రులతో ఆ రాష్ట్ర గవర్నర్ వాజుభాయ్ వాలా ప్రమాణస్వీకారం చేయించారు. మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమం రాజ్‌భవన్ వేదికగా జరిగింది. నూతన మంత్రుల ప్రమాణస్వీకారంతో ఆ రాష్ట్ర మంత్రుల సంఖ్య 28కి చేరింది.

మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఎస్‌టీ సోమశేఖర్, రమేశ్ ఎల్. జర్కిహోలీ, ఆనంద్ సింగ్, కే. సుధాకర్, బీఏ బసవరాజ, ఏ. శివరామ్ హెబ్బర్, బీసీ పాటిల్, కే. గోపాలయ్య, నారాయణ గౌడ, శ్రీమంత్ బి. పాటిల్ ఉన్నారు. వీరిలో జర్కిహోలీ, ఆనంద్ సింగ్ తప్ప మిగతా వారంతా మొదటిసారి మంత్రులుగా ప్రమాణం చేశారు.

ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే మహేశ్ కుమతల్లికి మంత్రివర్గ విస్తరణలో చోటు లభిస్తుందని అందరూ ఊహించారు. కానీ అది జరగలేదు. దీనిపై యెడియూరప్ప స్పందిస్తూ.. మహేశ్‌ను మంత్రివర్గంలో చేర్చుకోలేదు. కానీ అతనికి మంత్రి పదవి కంటే పెద్ద బాధ్యతను అప్పగిస్తామని సీఎం స్పష్టం చేశారు.

సవాళ్లకు తలొగ్గితే అభివృద్ధి సాధించే వాళ్లం కాదు

సవాళ్లపై వెనకడుగు వేస్తే ఎక్కడ వేసిన గొంగళే గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తే చారిత్రక మార్పులు చేసేవాళ్లమా? కాంగ్రెస్ మాదిరిగా ఆలోచిస్తే అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉండేవి 370 ఆర్టికల్, ట్రిపుల్ తలాక్ పరిష్కారం అయ్యేవి కాదు రామమందిర నిర్మాణం అలాగే ఉండేది ఈశాన్య రాష్ట్రాలను తాము ఢిల్లీకి చేరువ చేశాం మహాత్మాగాంధీ మీకు ట్రైలరే.... మాకు మాత్రం ఆయనే జీవితం కర్రల దాడిని తట్టుకునేలా సూర్య నమస్కారాల సంఖ్య పెంచుతా పౌరసత్వం,పౌరపట్టికలతో ఎవరికీ నష్టం లేదు ప్రభుత్వ పనితీరును మెచ్చిన ప్రజలు తిరిగి అధికారం కట్టబెట్టారు రాష్ట్రపతి ప్రసంగం నవీన భారత నిర్మాణాన్ని ఆవిష్కరించింది లోక్‌సభలో విమర్శలు..ఛతురోక్తులతో సాగిన ప్రధాని ప్రసంగం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): సవాళ్లకు తలొగ్గకుండా ముందుకెళ్తేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నొచుకొని ఎన్నో సమస్యలను మేము పరిష్కరించాం. గత ప్రభుత్వ విధానాన్ని అనుసరిస్తే చారిత్రక మార్పులు చేసేవాళ్లం కాదని ప్రధాని పేర్కొన్నారు. సవాళ్లపై వెనకడుగు వేస్తే ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉండిపోతామనీ.. సవాళ్లు, సమస్యలను ఎదుర్కొనే సత్తా తమలో ఉందని ప్రధాని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ ఇవాళ లోక్‌సభలో ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగం నవీన భారత నిర్మాణాన్ని ఆవిష్కరించిందంటూ కొనియాడారు. లోకసభ వేదికగా కాంగ్రెస్ పార్టీపైనా, ఆ పార్టీ నేతృత్వంలో కొనసాగిన గత ప్రభుత్వాల పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విమర్శలు, ఛతురోక్తులు,హాస్యం పండిస్తూ ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. కాంగ్రెస్ మాదిరిగా ఆలోచించి ఉంటే దేశంలో ఇప్పటికీ అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోయే వంటూ దుయ్యబట్టారు. ట్రిపుల్ తలాక్ పేరుతో ముస్లిం మహిళలను భయపెట్టారనీ... కాంగ్రెస్ బాటలో వెళ్తే ట్రిపుల్ తలాక్ సమస్య ఇప్పటికీ అలాగే ఉండేదని ప్రధాని పేర్కొన్నారు. మీలా ఆలోచిస్తే రామ మందిర వివాదం ఇప్పటికీ కొనసాగేది. జమ్మూ కశ్మీర్ ప్రజల కష్టాలు కూడా అలాగే ఉండేవి. కర్తాపూర్ సాహెబ్ కారిడార్ వాస్తవ రూపంలోకి వచ్చేది కాదు. ప్రభుత్వమే కాదు.. పాలనలోనూ ప్రజలు మార్పు కోరుకున్నారు. 70 ఏళ్ల పాటు 370 ఆర్టికల్ అలాగే కొనసాగింది. ప్రపంచం భారత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నందున... తదనుగుణంగా పనిచేయాల్సి ఉందన్నారు. అందుకోసం తాము అందరినీ కలుపుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఈరాష్ట్రపతి ప్రసంగం దేశ ప్రజలకు విజన్‌ను, దైరక్షన్‌ను ఇచ్చిందన్నారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం మా కార్యాచరణ పట్ల ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయన్నారు. అతి తక్కువ సమయంలో ప్రభుత్వం ఇన్ని అద్భుతాలు ఎలా చేస్తుందని ప్రతిపక్షాలు ఆశ్చర్యపోతున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని మార్చడమే కాదు, ఆ ప్రభుత్వంతో ముందకు వెళ్లేందుకు సిద్ధమయ్యారన్నారు. గత 70 ఏళ్ల పాలన తరహాలోనే ప్రభుత్వం నడిస్తే.. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అయి ఉండేది కాదన్నారు. ట్రిపుల్ తలాక్‌ను కూడా రద్దు అయ్యేది కాదన్నారు. ప్రతిపక్షాల తరహాలో ప్రభుత్వం ఆలోచించి ఉంటే..

అయోధ్యలో రామమందిర నిర్మాణం నిజం అయ్యేది కాదని ప్రధాని తెలిపారు. కర్తార్‌పూర్ కూడా వాస్తవ రూపం దాల్చేదికాదన్నారు. రాజకీయ స్థిరత్వం కోసం ఈశాన్యా రాష్ట్రాలు ఎన్నో దశాబ్దాలు వేచి చూశాయన్నారు. కానీ మేం ఈశాన్య రాష్ట్రాలను తాము ఢిల్లీకి చేరువ చేశామన్నారు. బోడోలు ఆయుధాలను విడిచిపెట్టినట్లు ప్రధాని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న కనీస మద్దతు ధర సమస్యను పరిష్కరించామన్నారు. కొన్ని రాష్ట్రాలు పీఎం కిసాన్ స్కీమ్‌ను అమలు చేయడం లేదని, రైతుల విషయంలో రాజకీయాలు చేయవద్దు అని, మనం అందరం రైతులను విస్మరించకూడదన్నారు. ప్రధాని ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ ఎంపీలు ఆందోళన చేపట్టారు. మహాత్మా గాంధీ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో భాగంగా మోదీ మాట్లాడుతున్నప్పుడు కాంగ్రెస్ నేతలు నినాదాలతో హోరెత్తించారు. ఇటీవల బీజేపీ ఎంపీ హెగ్డే .. గాంధీజీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నేతలు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ సభలో మాట్లాడుతూ.. ట్రైలర్ ఇప్పుడే మొదలైందన్నారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న ప్రధాని మోదీ.. మహాత్మా గాంధీ మీకు ట్రైలరే కావచ్చు, కానీ మాకు మాత్రం ఆయనే జీవితం అన్నారు. గాంధీజీ చేపట్టిన స్వాతంత్ర్య ఉద్యమం ఓ డ్రామా అని ఇటీవల బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే ఓ సభలో మాట్లాడుతూ కామెంట్ చేశారు. బ్రిటీష్ వారితో ఒప్పందం చేసుకుని గాంధీ ఉద్యమం నడిపారన్నారు. ఆ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండించింది.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించని పక్షంలో మోదీ సర్కార్‌కు గడ్డుకాలం తప్పదన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఆరునెలల్లో నిరుద్యోగ సమస్యను పరిష్కరించకపోతే ప్రధాని మోదీని యువత కర్రలతో బాదుతారని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై ప్రధాని మోదీ గురువారం పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా బదులిచ్చారు.

చరిత్రలో నేటినిజం



కం॥ మూర్ఖుని సభలమున గొరుచు
తొర్పరియై సాటి కవుల దిట్టకవి జలన
నేర్పున నిడ – ప్రజలమది న
కొర్పరియై "ముద్దు కృష్ణ" కాబవైయుండునే!!



ఫిబ్రవరి 7 సాయినేని ముద్దుకృష్ణ జయంతి)

–రాధశ్రీ
సెల్: 9494481210

బలమైన ఈదురుగాలులతో రన్‌వేను ఢీకొన్న విమానం

మూడు ముక్కలుగా ప్రమాదం

ముగ్గురు మృతి..

179మందికి గాయాలు

ఇస్తాంబుల్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): టర్కీష్‌లోని ఇస్తాంబుల్ ఎయిర్‌పోర్టులో ఘోర ప్రమాదం జరిగింది. బలమైన గాలులు, భారీ వర్షం కారణంగా విమానం రన్‌వేను ఢీకొనడంతో.. మూడు ముక్కలైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు మృతి చెందారు. 179 మంది గాయపడ్డారు. పెగాసస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 విమానం ఇజ్మీర్ నుంచి ఇస్తాంబుల్‌లోని సబీహా గోక్సెన్ ఎయిర్‌పోర్టుకు బయల్దేరింది. గోక్సెన్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేస్తున్న భక్తులకు స్వాగతం - సుస్వాగతం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు

గౌ॥శ్రీ కల్వకుంట్ల చంద్రశేకర్‌రావు గారు నేడు సమ్మక్క - సారలమ్మ

జాతరకు విచ్చేయుచున్న శుభసందర్భంగా వారికి స్వాగతం - సుస్వాగతం

శ్రీ వి. చక్రధర్‌రావు, M.Sc
ప్రాజెక్టు అధికారి
ఐ.టి.డి.ఏ., ఏటూరునాగారం

శ్రీ ఆర్.వి.కర్ణన్ I.A.S.
జిల్లా కలెక్టర్, (ఎఫ్ఏసి),
ములుగు

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఏటూరునాగారం, ములుగు జిల్లా

నేటినిజం
శుక్రవారం 7-2-2020

విసిగిస్తున్న ధ్వని..

తెలంగాణ ప్రాంతంలోను ప్రధానంగా రాజధాని భాగ్యనగరంలోను బడులలోని బుడుతలు ఇన్నాళ్లుగా ఈ వాహన యంత్రాల 'కారు'కూతలను వింటూనే ఉన్నారన్నది హైదరాబాద్ ఉన్నత న్యాయస్థానం వారి దృష్టిని ఆకర్షించిన వైపరీత్యం. ఈ వైపరీత్యం గురించి, "బొయ్ బొయ్"మని వాహన చోదకులు పాఠశాలల సమీపంలో హార్న్-లను మోగించడం గురించి హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి డాక్టర్ విపిన్ శ్రీవాత్సవ ఉత్తరం వ్రాశాడట! పాఠశాలల సమీపంలోని రహదారుల మీద పరుగులు తీసే వాహనాలు 'కూతలు' వేయరాదన్నది ఆదర్శం! ఈ ఆదర్శం ఇన్ని దశాబ్దులుగా ఆచరణకు రాలేదన్నది ఇప్పుడు బయటపడిన వాస్తవం. పాఠశాలల సమీపంలో మాత్రమే కాదు, వైద్యశాలల సమీపంలోను, జనావాస ప్రాంగణాల-రెసిడెన్షియల్ కాలనీస్-లోను గార్ధ్ర స్వరాల వంటి, శునక రోదనల వంటి చిత్ర విచిత్ర శబ్దాలను మోగిస్తున్న విచక్షణ శూన్యులైన వాహన చోదకులు ప్రశాంతికి భంగం కలిగిస్తున్నారు. ఈ ధ్వని కాలుష్య బీభత్సం గురించి ఉన్నత న్యాయస్థానం దృష్టికి తెచ్చిన భూతపూర్వ ఉపకులపతి శ్రీవాత్సవ అభినందనీయుడు. ఈ వికృత రవాల గురించి దేశంలోని అన్ని పట్టణాలలోని నగరాలలోని ప్రజలందరికీ తెలుసు. అందరూ వింటూనే ఉన్నారు. అందరూ మౌనం వహిస్తుండడం, మౌనంగా సహిస్తుండడం, ధ్వని బీభత్సాన్ని అనుభవిస్తుండడం నడుస్తున్న చరిత్ర. ఈ చరిత్రను గురించి తన ఉత్తరంలో వివరించిన వాడు డాక్టర్ శ్రీవాత్సవ!

పాఠశాలలు వైద్యశాలలు జనావాసాలు నెలకొన్న స్థలాలను శబ్ధచాలన నిషిద్ధ ప్రాంగణాలు'- నో హాంకింగ్ జోన్స్- గా ప్రకటించాలని ప్రభుత్వాలను ఆదేశించాలని డాక్టర్ శ్రీవాత్సవ తన ఉత్తరంలో ఉన్నత న్యాయస్థానం వారిని అభ్యర్థించాడట.

ఇలాంటి ప్రాంగణాలలోని రహదారులపై ఇష్టం వచ్చినట్టు 'హార్న్'లను గట్టిగా మోగించి వికృత ధ్వనులతో బడిపిల్లలను, వ్యాధిగ్రస్తులను, ఇళ్లలోని 'ఉయ్యాల'లోని పసిపాపలను, వృద్ధులను హడలగొడుతున్న వాహన చోదకులను కఠినంగా శిక్షించడానికి వీలైన నిబంధనలను రూపొందించ వలసిందిగా ప్రభుత్వాలను ఆదేశించాలని కూడ డాక్టర్ శ్రీవాత్సవ అభ్యర్థించడం ధ్వని కాలుష్యం పట్ల వారి నిరసనకు నిదర్శనం. చోదన- డ్రయివింగ్- నిబంధనలు సరిగా తెలియని వారికి 'రహదారి రవాణా అధికారులు' 'చోదక అనుమతి పత్రం' - డ్రయివింగ్ లైసెన్స్- మంజూరు చేయడం పట్ల కూడ శ్రీవాత్సవ ఆందోళనను వ్యక్తం చేశాడట... ప్రజాహితం పట్ల శ్రీవాత్సవకున్న తపనకు ఇదంతా నిదర్శనం. శ్రీవాత్సవ ఉత్తరాన్ని 'పిల్'గా స్వీకరించిన ఉన్నత న్యాయస్థానం వారు కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ ప్రభుత్వానికి 'విస్తృత హైదరాబాద్' నగర పాలిక- జిహెచ్ఎమ్‌సి- వారికి సమాధానం చెప్పవలసిందిగా ఆదేశాలను జారీచేశారట. ఈ ప్రభుత్వాలు సమాధానాలు చెప్పవలసి ఉంది. ఈ ధ్వని కాలుష్య సమస్యకు సర్వసమగ్రమైన పరిష్కారం కనుగొనాలన్నది ఉన్నత న్యాయస్థానం వారికి శ్రీవాత్సవ చేసిన విజ్ఞప్తి! చోదక అనుమతులను పొంది వాహనాలను నడుపుతున్న వారిలో చాలామందికి నియమాలను గురించి అవగాహన లేదు. అందువల్ల నియమాలను ఉల్లంఘిస్తున్నామన్న ధ్యాస కూడా వారికి లేదు. ఈ సంగతిని డాక్టర్ శ్రీవాత్సవ తమ ఉత్తరంలో పేర్కొన్నారట. ప్రధాన న్యాయమూర్తి టి.బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి వి.రామసుబ్రహ్మణ్యం పంపించిన ప్రశ్నలకు ప్రభుత్వాలు ఏమి సమాధానం చెప్పగలవు? సమాధానం ప్రభుత్వాల వద్ద లేదు. ఎందుకంటె పాఠశాలలు తదితర నిర్దిష్ట స్థలాల వద్ద 'హార్న్ కొట్టరాదు..'- అన్న ప్రకటనలు దర్శనమిస్తూనే ఉన్నాయి. అయినా నిబంధనలను పట్టించుకోకుండా వికృత ధ్వనులతో బాదేస్తున్న వాహన చోదకులు 'విబుధ దైత్యులు', చదివిన రాక్షసులు! వీరిని నియంత్రించలేని ప్రభుత్వ యంత్రాంగానికి కారణం అవినీతి, క్రూరమైన నిర్లక్ష్యం..

పౌరసరఫరాల అక్రమాలపై టాస్క్‌ఫోర్స్

బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు
అవినీతి అధికారుల చర్యలపై నిఘా

హైదరాబాద్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరకుల అక్రమ రవాణాకు అడుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వివిధ స్థాయిల్లో కొనసాగుతున్న అక్రమ దందాకు చెక్‌పెట్టేందుకు ఐదు బృందాలతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇటీవల చౌకబియ్యం బాగా పక్కదారి పడుతున్నాయి. అనేకచోట్ల దాడులు చేసి పట్టుకుంటున్నారు. ఇందుకు కొందరు శాఖ అధికారుల తోడ్పాటు ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. పలు అవినీతి అరోపణలను ఎదుర్కొంటున్న పౌరసరఫరాల శాఖ పనితీరును మెరుగుపరచడంతో పాటు ఆ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఈ సారి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. ధాన్యం సేకరణలో రైతుకు కనీస మద్దతు ధర, సీఎంఆర్ పథకం కింద బియ్యానికి మెరుగుపెట్టడం, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, ఇతర పథకాలకు పౌరసరఫరాల సంస్థ రైసుమిల్లర్ల నుంచి సన్నబియ్యం కొనుగోలు చేస్తోంది. ఏటా సుమారు రూ. 10 వేల కోట్లకు పైగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న శాఖలో అధికారులు, సిబ్బంది కొరతతో పాటు నిర్లక్ష్యంతో వందల కోట్ల రూపాయల సరకులు పక్కదారి పడుతున్నాయి. సరకులను పక్కదారి పట్టిస్తున్న అక్రమదారులను గుర్తించినా స్థానిక అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల సంస్థ బోర్డు సమావేశంలో ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఐదు బృందాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేస్తూ పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రైసుమిల్లుల యాజమానులు, బియ్యం రవాణా గుత్తేదార్లు, చౌక ధరల దుకాణ డీలర్ల అక్రమాలను అరికట్టడమేగాక నాణ్యమైన సరకులను సరఫరా చేయడం కోసం విశ్రాంత పోలీసు అధికారులతో సహా వాణిజ్యపన్నుల శాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన 20 మంది సభ్యులతో పౌరసరఫరాల శాఖ ఐదు బృందాలుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అధికారులు అక్కడక్కడ దాడులు నిర్వహించి నప్పటికి పూర్తిస్థాయిలో అక్రమ రవాణా అరికట్టలేక పోతున్నారు. పౌర సరఫరాల విభాగంలో వివిధ స్థాయిలో వాటి పనితీరుపై తనిఖీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ గోదాంలను నిరంతరం పరిశీలిస్తారు. మొదటి దశ, రెండో దశ, రవాణా తనిఖీలు చేస్తారు. ఈ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా వారికి కేటాయించిన ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్రమ రవాణాదారులపై కేసునమోదు చేయనున్నారు. సమాచారాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ, కలెక్టర్, ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తారు. వీటి ఆధారంగా ఆక్రమణదారులపై కలెక్టర్ చర్య తీసుకుంటారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకున్నా మార్పు రాకుండా అలాగే రవాణా చేస్తే పీడీ యాక్టు కింద కఠిన చర్యలు చేపడతారు. అవసరమైతే రైసుమిల్లర్స్, రవాణా గుత్తేదారులపై చర్యలు తీసుకుంటారు.

ఉపాధి పథకం బిల్లుల మంజూరులో నిర్లక్ష్యం

-పనుల్లో చేరడానికి ఆసక్తి చూపని కూలీలు

హైదరాబాద్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ):ఉపాధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో ఆలస్యం కారణంగా గ్రామాల్లో కూలీలు పనులకు రావడానికి ఇష్టపడడం లేదు. వారానికి ఒకసారి కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ కేంద్రం నుంచి నిధులు సకాలంలో విడుదల కాకపోవడం మూలంగా నెలలతరబడి ఈ పనులకు వెళ్తున్న కూలీలు వేతనాలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. దీంతో చాలా మంది ఈ పనులపై అనాసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా చాలా గ్రామాల్లో పనులు చేపట్టేందుకు అనువైన వాతావరణం ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా పనులు కొనసాగడం లేదు. కేవలం వేసవిలో మాత్రమే ఈ పనులను చేపడుతున్నారు. 52రకాల పనులు చేయించేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. చాలా చోట్ల అమలు కావడం లేదు. కొన్ని చోట్ల సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ కనబర్చి ఈ పనులను చేపడుతున్నారు. ఫలితంగా పల్లెల్లో కూలీ పనులు లభించక పేదలు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సివస్తోంది.పల్లెలో అనేకమంది పేదలు కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ పనులతో పాటు ప్రస్తుత ఉపాధిహామీ పథకంపైనే నమ్మకం పెట్టుకున్నారు. ఉదయం పూట ఈ పనులకు వెళ్లిన తర్వాత మళ్లీ వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. దీంతో పేదలకు ఈ ఉపాధి డబ్బులు ఆర్థికంగా చేదోడుగా నిలుస్తున్నాయి.జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సమావేశం నిర్వహిస్తే ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయం కుదిరే అవకాశముంది. గ్రామాల్లో అవసరమైన పనుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో కసరత్తు చేసి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. నిజంగానే అలాచేసివుంటే ఉపాధిహామీ పథకంలో అనుసంధానించిన ఆయా శాఖల అధికారుల సమన్వయంతో మరింత మెరుగైన పనితీరుకు ఆస్కారం ఏర్పడేది. నిజానికి ఇదంతా ఓ గందరగోళ వ్యవహారంగా ఉంది.

గ్రామాల అభివృద్ధిపై మనసు పెట్టాలి

-సర్పంచుల పట్టుదలతోనే గ్రామస్వరాజ్యం : ఎమ్మెల్యే

సిద్దిపేట,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు పాటుపడాలని దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు పల్లె ప్రగతిలో ముందుండాలని, వారంతా గ్రామాల అభివృద్ధిపై సమగ్ర అవగాహన తెచ్చుకోవాలన్నారు. నిధులు,విధుల గురించి తెలుసుకుని ముందుకు సాగితే సిఎం కెసిఆర్ ఆశించిన గ్రామస్వరాజ్య లక్ష్యం సిద్ధిస్తుందని అన్నారు. గ్రామాల్లో మెరుగైన పాలన అందించే పూర్తి బాధ్యత సర్పంచ్‌దని గుర్తు చేశారు. సర్పంచ్ స్థానికంగా ఉంటేనే ప్రజల మన్ననలు పొందుతారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించి ప్రజాసేవలో భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పదవులు దక్కిన తర్వాత గ్రామాలను వీడి పట్టణాల్లో ఉండే ప్రజాప్రతినిధులను గ్రామస్తులు నిలదీయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయం అందజేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకే సీఎం కేసీఆర్ 24గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అమలువుతున్న రైతు బంధు పథకంపై ఐక్యరాజ్యసమితిలో చర్చించడం కేసీఆర్ దక్కిన గౌరవం అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రైతుబంధు లాంటి పథకం ప్రవేశపెట్టిందన్నారు. కేంద్రానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం కన్నా ఎక్కువ ఇవ్వాలన్నారు. ఏడాదికి రూ.6వేలు మాత్రమే ఆర్థిక సహాయం ప్రకటించడం, అది కూడా మూడు విడతల్లో ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రూపు రాజకీయాలు చేయవద్దని, ఏక నాయకత్వంలో ముందుకెళ్లే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యేగా సీడీఎఫ్ నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

ఉపాధిహామీలో నర్సీరీల ఏర్పాటు

జనగామ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): మొక్కలు పెంచి హరితహారంలో ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఉపాధిహామీ సహాయ ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. ఉపాధిహామీలో భాగంగా నర్సరీలు ఏర్పాటు చేసింది. వర్షాలు పడే నాటికి మొక్కలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పలు నర్సరీల ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే పలు నర్సరీల్లో లక్షల బ్యాగులు మట్టితో నింపిగా లక్షా40 వేల టేకు స్టంప్స్ మండలానికి చేరినట్లు తెలిపారు. నర్సరీల్లో జరుగుతున్న పనులను పరిశీలించి సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులకు పలు సూచనలు చేశారు. నర్సరీ చుట్టూ కంచె ఉండాలని, ప్రతి రోజూ రెండు సార్లు నీరు పోయాలని తెలిపారు.

మార్కెట్ మాయాజాలం పోతేనే రైతుకు న్యాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6:వ్యవసాయాభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా రైతుల ఆర్థిక స్థితిగతి మారడం లేదు. రోగమొకటి అయితే మందొకటిలా నిర్ణయాలు ఉంటున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ఇటీవల వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా పథకాలు ప్రకటించారు. అలాగే అనేక తాయిలాలు వెల్లడించారు. గతంలో ఈ -నామ్ ప్రకటించి రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. అయితే పథకాల ప్రకటన ఎలా ఉన్నా వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం ఉండాలి. సమన్వయంతో పథకాలను ముందుకు తీసుకుని వెళ్లగలగాలి. అప్పుడే అన్నదాతలకు మేలు జరుగుతుంది. కానీ అలాంటి సమన్వయం లోపించడం వల్లనే పథకాల అమలులో ఇబ్బందులు వస్తున్నాయి. ఇకపోతే రైతులకు ఏం కావాలన్న లోతైన ఆలోన జరగడం లేదు. అనేక పథకాలు వస్తున్నా రైతుల స్థితిగతులు ఎందుకు మారడం లేదన్న ఆలోచనలను ప్రభుత్వాలు చేయడం లేదు.

ప్రధానంగా పెట్టుబడులు,ఎరువులు, మార్కెటింగ్ వంటి అంశాల విషయాల్లో రైతులకు మోసాలు జరుగుతున్నాయి. విత్తనాల దగ్గర మొదలయ్యే యుద్ధం పంటలు పండించి అమ్ముకునే వరకు చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టున పెట్టుబడి కూడా దక్కని దుర్భర పరిస్థితులు ఉన్నాయి. మార్కెట్ మాయాజాలంపై ప్రభుత్వాలకు నియంత్రణ లేకుండా పోతోంది. మద్దతు ధరలు దక్కడం లేదు. పత్తి,మిర్చి, కందిలాంటి పంటలకు ధరలు దక్కడం లేదు. మార్కెట్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. అలాగే పంటలను దళారులు వారు నిర్ణయించిన ధరలకే అమ్మాల్సి వస్తోంది. తెలంగాణలో రైతులకు ఎకరాకు పదివేల పెట్టుబడి, ఉచిత విద్యుత్,ఉచితంగా సాగునీరు అందిస్తున్నా మార్పు రావడం లేదు. పంటల దిగుబడి పెరుగుతున్నా మద్దతు ధరలు దక్కక వచ్చిన కాడికి తెగనమ్ము కోవాల్సి వస్తోంది. ఇవన్నీ చేస్తున్న ప్రభుత్వం మార్కెట్లను కంట్రోల్ చేయడం లేదు. అధికార పార్టీకి చెందిన కమిటీలు ఉన్నా వారు కూడా దళారులతో చేతులు కలిపి రైతులను నిండా ముంచుతున్నారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి అనేక అననుకూలతల నడుమ రైతు పండించిన పంటను అమ్ముకుందామంటే దానికి న్యాయమైన ధర చెల్లించి కొనుగోలు చేసే నాథుడు లేని దయనీయ పరిస్థితి నెలకొనడం శోచనీయం. వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేయకుండా రైతుకు భరోసా కల్పించేలా పంటలను కనీస మద్దతు ధరకైనా కొనుగోలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. ఎపిలో కూడా పరిస్థితులు ఇందుకు భిన్నంగా లేవు.

ధాన్యం కొనుగోలు పట్ల సర్కారు తగినంత శ్రద్ధ పెట్టకపోవడం వల్లనే రైతులకు న్యాయం జరగడం లేదన్నది సత్యం. కొనుగోళ్లకు సంబంధించిన పాలసీని పౌరసరఫరాల శాఖ పర్యవేక్షిస్తున్నా మార్కెట్‌లో మద్దతు ధర కంటె వంద నుండి మూడు వందల రూపాయల వరకు తగ్గించి కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా తేమ శాతం పేరిట ధర తగ్గించడం మిల్లర్లకు వెన్నతో పెట్టిన విద్య. ఈ దురాగతాలకు చెక్ పెట్టడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యంగా గుర్తించాలి. వ్యవసాయ మార్కెట్‌యార్డుల్లోని తేమ కొలిచే సాధనాలు చూపినదానికంటె మిల్లర్ల వద్దనున్నవి ఎక్కువగా చూపు తున్నాయి. ఆ ప్రకారమే ధర చెల్లిస్తామని ఆ మేరకు కోత పెడుతున్నారు. రవాణా, తూనిక ఛార్జీల పేరిట రైతుల నుండే కొంత వసూలు చేస్తున్నారు.

ఇక మీ భూమి కాపీల పేరిట, ఇ క్రాప్ బుకింగ్ సాకులు కూడా పెట్టి కొనుగోళ్లను మందగింపజేయడం మరో మెలిక. ప్రభుత్వం ఈ విషయంలోనూ తగిన చర్యలు చేపట్టి వాస్తవ సాగుదార్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి. కౌలుదార్లు, పేద, మధ్యతరగతి రైతులు తమ పంటలను కళ్లం గట్టునే అమ్ముకుంటారు. ఈ సమయంలో మద్దతు ధరకు కొనుగోళ్లు జరిగితేనే వారికి న్యాయం జరుగుతుంది. ఆలస్యం జరుగుతున్నకొద్దీ వారికి అన్యాయమే కాగలదు. ఎపిలో మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని, దీంతో రైతులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. ఆ మాటను తక్షణం ఆచరణలో పెట్టాలి. వెంటనే ధాన్యం కొనుగోలు పాలసీని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారికంగా ప్రకటించాలి. కొనుగోళ్లకు అవసరమైన మేరకు ఆ కార్పొరేషన్‌కు నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి. పంట చేతికొచ్చే సమయంలో రైతుకు న్యాయమైన ధర కల్పించడం కోసం అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలి. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరను గ్యారంటీ చేసి కొనుగోలు జరిగేట్టు చూడడం వల్ల మాత్రమే వారికి న్యాయం జరగగలదు.

ఇక రాష్ట్రంలో ప్రధానమైన వరి పంట కొనుగోలు విషయంలో అటువంటి పరిస్థితి తలెత్తరాదు.వరి, జొన్న, మొక్క జొన్న, రాగి, కందులు, మినుములు, పెసలు, శనగ, వేరుశనగ, పసుపు, మిరప తదితర పంటలకు కనీస గిట్టుబాటు ధరలను ప్రకటించి అమలు జరిగేలా చూడాలి. దేశ వ్యాప్తంగా కూడా వరి సాగు విస్తీర్ణం, ఉత్పత్తి తగ్గినట్టు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ శాఖలతోబాటు స్కైమెట్ వంటి సంస్థలూ నివేదికలిచ్చాయి. మొత్తంగా మార్కెట్లో రైతుకు దగా జరగకుండా చూడనంత వరకు ఎన్ని పథకాలు ప్రకటించినా రైతన్నలకు మేలు చేకూరదని గుర్తుంచుకోవాలి.

నిధుల కొరత లేకుండా చూస్తేనే పల్లెలకు మహర్దశ

పల్లె ప్రగతి కార్యక్రమాల్లో సర్పంచ్‌లదే బాధ్యత

హైదరాబాద్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన పనులకు నిధుల కొరత రాకుండా చూస్తే గ్రామాలు పరిపుష్టం కాగలవు. నరేగా నిధులను రాష్ట్రాల అజమాయిషీలో పెట్టి వారు గ్రామాల అభివృద్ధికి వినియోగించేలా చేయాలన్న డిమాండ్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి. గ్రామాల్లో ఇష్టం వచ్చినట్లుగా కాకుండా ఓ పద్ధతి ప్రకారం మౌళిక వసతుల కల్పనకు నిధులు ఉపయోగపడాలి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరుగాలని, హరితహారం పనులకు మొదటి ప్రాధాన్యం, శ్మశానవాటికల నిర్మాణానికి రెండో ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి నిధులను ఉపయోగించాలని సిఎం కెసిఆర్ పదేపదే సూచించారు. అన్ని గ్రామాలకు కచ్చితంగా బీటీరోడ్లు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు బృందాలుగా విడిపోయి ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. నిధులు దుర్వినియోగం కావద్దని, ప్రతి పైసా సద్వినియోగం కావాలని చెప్పారు. ఇలా చేస్తూ పోతే కొంతకాలానికైనా అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందనడంలో సందేహం లేదు. పల్లెలె ప్రగతి వైపు పరుగెత్తేలా సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయంతో గ్రామాల్లో అభివృద్ధి సాకారం కానుంది. దశాబ్దంన్నర దాటినా ఇంతకాలం ఉపాధి పనులను చూస్తే బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. ఉపాధిహామీని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకునే వెసలుబాటు ఉంది. తాజా గా సిఎం కెసిఆర్ నిధులను సంపూర్ణంగా వినియోగించుకొని గ్రామాల్లో హరితహారం, వైకుంఠ ధామాల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇది ఓ రకంగా సరైన దిశలో నిధులను ఉపయో గించుకునే కార్యక్రమంగా చూడాలి. నరేగా నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపటాలన్నారు. నరేగా పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. అలాగే తెలంగాణకు హరితహారంలో భాగంగా రాష్ట్రంలోని 12,751 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటుచేసారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి, రక్షించాలని ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. గుంతలు తవ్వడానికి, నీళ్లు పోయడానికి, ఇతరత్రా పనులకు ఉపాధి నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మొక్కలు పెట్టడం, వాటిని రక్షించడం లాంటి బాధ్యతలు గ్రామ పంచాయతీలు చేపట్టాలన్న సీఎం సూచనలు సర్పంచ్‌లకు స్ఫూర్తి కావాలి. ఎందరో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. ఇకపోతే రహదారులు లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. అలాంటి గ్రామాల సర్పంచ్‌లు చొరవ తీసుకుని ముందుకు సాగాలి. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాలని ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయం తీసుకున్నదని సీఎం కేసీఆర్ చెప్పిన దరిమిలా వీరంతా తమ గ్రామాలకు సంబ ంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఆయా గ్రామాల సర్పంచ్‌ల ప్రతిభ,పట్టుదల తోడైతే ప్రగతి సాధ్యం కానుంది.

చౌకబియ్యం తరలిపోకుండా నిఘా

సరిహద్దుల్లో నిరంతర పర్యవేక్షణ
చెక్‌పోస్టులతో అడ్డుకునే యత్నాలు

నిజామాబాద్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టింది. ఉద్యోగ విరమణ చేసిన నలుగురు అధికారులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఏర్పాటు చేసింది. బియ్యం పక్కదారి పడుతుండడంతో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు ప్రారంభించింది. వీరు క్రమంగా చౌకధరల దుకాణాలను తనిఖీ చేస్తూ సరుకుల పంపిణీని, స్టాక్ నిల్వలను, రేషన్ బియ్యం రీసైక్లింగ్ కాకుండా, మిల్లర్లు రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటలు వివరాలను సేకరిస్తారు. పంటల అక్రమ నిల్వలను సైతం పరిశీలిస్తారు. అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటారు. దీంతో ప్రజా పంపిణీ దుకాణాల ద్వారా పంపిణీ చేసే సరకులు పక్కదారి పట్టే అవకాశాలు ఉండవు. రేషన్ డీలర్లు సైతం కార్డుదారుల నుంచి ఎక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి అంతకంటే ఎక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు లారీల ద్వారా రేషన్ బియ్యం, ఇతర వస్తువులు సరఫరా చేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి బియ్యం సరఫరా చేసే వాహనాల్లో జీపీఎస్ పరికరాల ను అమర్చారు. ఫలితంగా రేషన్ వస్తువులు సక్రమంగా దుకాణాలకు చేరే అవకాశాలున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ దుకాణాల డీలర్లు లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేస్తారు. ఈ బియ్యం తీసుకుంటున్న కొంతమంది వినియోగిస్తుండగా, మరికొందరు అధిక ధరలకు అమ్ము కుంటున్నారు. పౌరసరఫరాల శాఖ ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సైతం రేషన్ దుకాణాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన దుకాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నాయి. జిల్లా నుంచి రేషన్ బియ్యం మహారాష్ట్ర ఇతర ప్రాంతాలకు సైతం అక్రమంగా రవాణా అవుతోంది. గిరిజన ప్రాంతాల్లో దుకాణదారులు బియ్యాన్ని తీసుకొని బదులుగా ఇతర నిత్యావసర వస్తువులను ఇస్తున్నారు. నలుగురు విశ్రాంత అధికారులతో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉద్యోగ విరమణ చేసిన ఎస్పీ స్థాయి అధికారితోపాటు, డిప్యూటీ డైరెక్టర్, ఏఎస్‌వో, సబ్ ఇన్‌స్పెక్టర్ బృందంలో సభ్యులుగా ఉంటారు. వీరు క్రమంగా చౌకధరల దుకాణాలను తనిఖీ చేస్తూ సరుకుల పంపిణీని, స్టాక్ నిల్వలను పరిశీలిస్తారు. బియ్యం, ఇతర వస్తువులు అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటారు. రేషన్ దుకాణంలో పంపిణీ చేసిన బియ్యం రీసైక్లింగ్ అయి సన్నబియ్యం రూపంలో పాఠశాలలు, వసతిగృహాలకు మరలకుండా చర

దేవాదులతో చెరువులకు గోదావరి నీళ్లు

-పలుగ్రామాల్లో రైతుల ఆనందం

జనగామ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ కాకతీయ పథకం ద్వారా పూడిక తీయడంతో పాడుబడిన చెరువుల్లో సాగునీటి వనరులు మెరుగయ్యాయి. దేవాదుల ద్వారా అనేక గ్రామాల చెరువులకు నీరు వచ్చి చేరింది. తద్వారా సాగు విస్తీర్ణం పెరిగింది. గ్రామాల్లో గోదావరి జలాలతో భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్యలు తొలగిపోయాయి. గ్రామాల్లోని చెరువులకు గోదావరి జలాలు రావడంతో వచ్చే వేసవిలో సాగు, తాగునీటి కష్టాలు ఉండవని రైతులు, ప్రజలు అంటున్నారు. గతంలో ఎప్పుడూ తమ గ్రామ చెరువు నిండడం చూడలేని ప్రజలు అంటున్నారు. చెరువుల్లో జలకళతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో బీడుగా మారిన భూములు నేడు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు. ప్రతీ ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇందులో సాగునీరు లేక తల్లడిల్లుతున్న జనగామ ప్రాంతానికి దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నీరందించి చెరువులు, కుంటలను నింపుతున్నారు. దీంతో ఎన్నడూ యాసంగి సాగుకు నోచుకోని అనేక గ్రామాలకు నటి సమస్య తీరింది. దీంతో వ్యవసాయానికి మళ్లీ మంచి రోజులు వస్తున్నాయని ప్రజలు సంబురపడుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సాగునీటి కాల్వల మరమ్మతులను ముందుకు తీసుకొచ్చారు. వ్యవసాయాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారు. బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి మండలంలోని అడవికేశ్వాపూర్, వెంకిర్యాల, పెద్దపహాడ్, వడ్లకొండ, ఓబుల్ కేశవాపురం, పెద్దరాంచర్ల, సిద్దెంకి, ఎల్లంల, పెంబర్తి గ్రామాల్లోని చెరువులను గోదావరి జలాలతో నింపి పంట పొలాలు సందడి చేసేలా చేపట్టారు. గ్రామాల్లోని చెరువులను గోదావరి జలాలతో నింపేందుకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కృషి చేశారు. దీంతో గ్రామాల్లోని చెరువులకు నీరు చేరింది. పెద్దపహాడ్ పెరుమళ్ల చెరువు, వడ్లకొండ అంకమ్మ చెరువు మత్తడి పోస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

-సన్నద్ధం చేస్తున్న జిల్లా విద్యాశాఖ

జగిత్యాల,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా విద్యాధికారి తెలిపసారు. ఈ మేరకు టీచర్లను, విద్యార్థులను సన్నద్ధం చేశామని అన్నారు. ఈ మేరకు మండలాలవారీగా సమీక్ష చేస్తున్నామని అన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో కృషి చేయాలనిఅన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తేజం కార్యక్రమంలో భాగంగా పదోతరగతి విద్యార్థులకు సంబంధించి పరీక్షలకు సిద్ధం చేస్తున్న తీరు, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పాఠశాలల వారీగా పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధన, పరీక్షలకు సిద్ధం చేస్తున్న విధానంపై ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణ సాధించాలనీ, అందుకు అనుగుణంగా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి అర్హులైన ఉపాధ్యాయులందరికీ ఉద్యోగోన్నతి కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు.

డుమ్మా టీచర్లపై కఠిన చర్యలు: డిఇవో

జనగామ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): పాఠశాలకు సక్రమంగా రాని టీచర్లపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి హెచ్చరించారు. కొందరు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించేలా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆశయాన్ని అమలు చేయని వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన చదువు చెప్పి వారి భవిష్యత్తు బంగారుబాట వేయాలని ఆయన సూచించారు. కొన్నిచోట్ల పాఠశాలకు రాకున్నా సంతకాలు చేసుకుంటూ వ్యవహారం నడిపిస్తున్నారని పలువురు డిఇవో దృష్టికి తీసుకుని వచ్చారు. పాఠశాలకు రాని వ్యవహరంపై పూర్తి విచారణ జరిపి శాఖా పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సర్కార్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలే తప్పా ఇలా హాజరు రిజస్టర్‌లో సీఎల్ అని రాసుకుంటూ ఇష్టారాజ్యంగా విధులక్కు డుమ్మా కొట్టడం ఏమిటన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి: యూటిఎఫ్

భద్రాద్రి కొత్తగూడెం,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. గత ఏడాది వేసవిలో మధ్యాహ్న భోజనం నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం సాధించడంలో ప్రయివేటు అధ్యాపకుల పాత్రను, వారి త్యాగాలను ప్రభుత్వం మరిచిపోయిందని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం నాయకులు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వానికి పత్రికల ద్వారా, ఉద్యమాల ద్వారా గుర్తు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తద్వారా ప్రయివేటు అధ్యాపకులు తమహక్కులను సాధించుకోవాలని సూచించారు. ప్రయివేటు అధ్యాపకులు అనుభవిస్తున్న ఇబ్బందులు అనేకం ఉన్నాయన్నారు. సరైన వేతనాలు లేక, ఉద్యోగ భద్రతలేక అవస్థలు పడ్తున్నారని చెప్పారు. అధ్యాపకుల వేతనాలు రూ.10వేలు, 15వేలకు మించి ప్రయివేటు యాజమాన్యాలు ఇవ్వడంలేదని చెప్పారు. ఏడాదిలో 8నెలల వేతనాన్ని సవరించాల్సిన అవసరం ఉందన్నారు.

కొమురవెల్లిలో భక్తుల కోలాహలం

సిద్దిపేట,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): కొమురవెల్లి మల్లన్నకు భక్తుల రాకతో పాటు ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. రాజగోపురం, గంగరేణి చెట్టు వద్ద పట్నాలు వేయడానికి భక్తులు తరలి వచ్చారు. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా కొమురవెల్లి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. మూడు నెలల పాటు జరిగే జాతరలో భాగంగా ప్రతి ఆదివారం స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. కోనేరులో స్నానం చేసి బోనాలతో ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. క్యూలైన్లు కిక్కిరిశాయి.

రామమందిర నిర్మాణానికి ప్రభుత్వం రూపాయి విరాళం

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యదర్శి వెల్లడి

విరాళాలు ఎవరు ఇచ్చినా స్వీకరించనున్న ట్రస్ట్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): అయోధ్య శ్రీ రామ మందిర నిర్మాణానికి అడ్డంకులన్నీ తొలగిపోవడంతో.. ఇక మందిర నిర్మాణ దిశగా అడుగులు వేస్తోంది ప్రభుత్వం.

ఈ నేపథ్యంలో మందిర నిర్మాణం కోసం.. స్వతంత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పార్లమెంట్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అంతేగాకుండా ప్రభుత్వం తరపున రూపాయి విరాళం ప్రకటించారు. అయోధ్య రామమందిర నిర్మాణానాకి గాను ..'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం'కి మోదీ సర్కార్.. ప్రభుత్వం తరపున విరాళాన్ని ప్రకటించింది. అది కూడా కేవలం ఒక్కరూపాయిని మాత్రమే. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యదర్శి డి.ముర్ము.. స్పష్టం చేశారు. ట్రస్టు సభ్యులకు ఒక రూపాయి నగదును అందజేశామన్నారు. ఈ సందర్భంగా.. రామమందిర నిర్మాణం కోసం ఎవరైనా విరాళాలను ఇస్తే.. వాటిని ఎటువంటి షరతు లేకుండా స్వీకరిస్తామన్నారు.

నగదు, ఆస్తుల రూపంలో ఇచ్చినా .. ట్రస్టు స్వీకరిస్తుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ట్రస్టు మాజీ అటార్నీ జనరల్ పరాశరన్ ఇంటిని కేంద్రంగా చేసుకొని కార్యకలాపాలను కొనసాగించనున్నారు. త్వరలోనే ఈ 'శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్రం' ట్రస్టుకు అధికారిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా.. 'శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్రం' పేరుతో ఈ ట్రస్టును ఏర్పాట్లు చేసినట్లు లోక్‌సభలో ప్రధాని మోదీ తెలిపారు. ఆలయ నిర్మాణానికి దేశ ప్రజలంతా సహకరించాలని మోదీ పిలుపునిచ్చారు.

ఈ రామమందిర నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ట్రస్టులో 15 మంది ట్రస్టీలు ఉంటారని.. వారిలో ఒకరు ఎస్సీ వర్గానికి చెందిన వారు కూడా ఉంటారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. కాగా ఈ ట్రస్టుకు చైర్మన్‌గా పరాశరన్‌ను నియమించారు.

గ్రామాల్లో సహకార సందడి

పోటికి సిద్ధపడ్డ ఔత్సాహికులు

నామినేషన్ల ఘట్టం ప్రారంభంతో హడావిడి

హైదరాబాద్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): సహకార ఎన్నికల్లో పోటీపై రైతుల్లో విస్తృత చర్చ సాగుతోంది. అధికార టిఆర్ఎస్ ప్రతి జిల్లాల్లో అన్ఇన విండోలను కైవసం చేసుకునేలా ప్రణాళికతో ఉందుకు పోతోంది. నామినేషన్ల స్వీకరణ మొదలు కావడంతో అంతటా పీఏసీఎస్‌ల పరిధిలోని వార్డుల నుంచి డైరెక్టర్లుగా పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఏ వార్డు నుంచి ఎవరు పోటీ చేస్తున్నారు? ఏ రిజర్వేషన్ వచ్చింది? వంటి అంశాలను రైతులను ఆరా తీస్తున్నారు. వార్డులో ఎన్ని ఓట్లున్నాయి? మిగిలిన గ్రామాల్లో ఓట్ల సంఖ్య ఎంత? ఇలాంటి అంశాలను బేరీజు వేస్తున్నారు.

రిజర్వేషన్లు ఖరారు.. నోటిఫికేషన్ సైతం విడుదల కావడంతో జిల్లాల్లో సహకార ఎన్నికల సందడి మొదలైంది. ఆయా వార్డుల నుంచి పోటీ చేయాల్సిన డైరెక్టర్ పదవులకు సైతం రిజర్వేషన్లను సహకార శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారి నుంచి నామినేషన్లు సైతం స్వీకరించనున్నారు. ఈ నెల 15న పోలింగ్ జరనుండగా.. అదే రోజు ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్న విషయం తెలిసిందే. ఒక్కో ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 13డైరెక్టర్ వార్డులు ఉండగా.. ఆయా వార్డులన్నీ రెండు నుంచి నాలుగు గ్రామాల పరిధికి విస్తరించి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న పలువురు రైతులు.. తమ తమ ఊర్లలో తమకు ఉన్న అనుకూలతలను అంచనా వేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులంతా ఏకమై తమ ఊరి నుంచే వార్డు డైరెక్టర్‌ను పోటీలో నిలపాలా.. లేకుంటే పక్క ఊరి వారికి మద్దతు ఇవ్వాలా.. అనే విషయమై చర్చిస్తున్నారు. పార్టీల పక్షాన పోటీ చేద్దామా.. లేకుంటే వార్డు పరిధిలోని ఊర్లన్నీ ఒక్కటై రాజకీయాలకు అతీతంగా పోటీలో నిలుద్దామా.. అనే విషయం పైనా కొన్ని గ్రామాల్లో చర్చ కొనసాగుతోంది. పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై కన్నేసిన రాజకీయ ప్రముఖులు కూడా కొందరు పోటీకి ఎనలేని ఆసక్తి చూపుతున్నారు. తాను గెలిస్తే చైర్మన్ అయ్యే అవకాశం ఉందని.. రాజకీయ అంశాలు తనకు అనుకూలంగా ఉన్నందున తనకే అవకాశం ఇవ్వాలని గ్రామాల్లో రైతులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ఔత్సాహికులంతా నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖారరు కావడంతో ఆశావహులు సభ్యులను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. గురు, శుక్ర, శనివారాల్లో నామినేషన్లను స్వీకరించేందుకు ఆయా సొసైటీల్లో అధికారులు అన్ని ఏర్పా ట్లు చేశారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 10 తేదీన ఉపసంహరణల అనంతరం అదే రోజున అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. ఈ నెల 15న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపడతారు. దీంతో అన్ని జిల్లాల్లో సహకార ఎన్నికల వేడి మొదలైంది. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కలిసిరాకపోవడంతో నిరాశకు గురైన వారు ఈ ఆవకాశం అందిపుచ్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రామస్థాయి నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వరుస విజయాలతో జోరు మీదున్న టీఆర్ఎస్ పార్టీ మద్దతు కూడ గట్టుకోవడం కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి, రైతులకు అండగా నిలబడే సహకార సంఘాల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. సొసైటీ పరిధిలో ఉండే స్థానాలు తక్కువగా ఉండడంతో అన్ని గ్రామాల వారికి ఆవకాశం దక్కనుందని చెప్పవచ్చు. ఇప్పటికే పలు సొసైటీ పరిధిలో పార్టీలకతీతంగా అభివృద్ధే ధ్యేయంగా రైతులు, నాయకులు ఏకగ్రీవాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో అధ్యక్ష పదవి ఒక గ్రామానికి అవకాశం ఇస్తే , ఉపాధ్యక్ష పదవిని పొందేందుకు అంగీకారాలు చేసుకునేలా ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సొసైటీ ఎన్నికల్లో పోటీకి ఒకరిని మించి గ్రామాల్లో మరొకరు పోటీలో ఉండేందుకు సిద్ధంగా కాగా, మరోవైపుఓటర్లు మాత్రం రైతులకు సహకారం అందించే వారికి మాత్రమే తమ ఓటు అని స్పష్టం చేస్తున్నారు. ఆశావహులు మాత్రం రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో రుణాలు, సరిపడా ఎరువులు, విత్తనాలు అందిస్తామని, ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీలు ఇస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న చంద్రబాబు

బాబుకు ముందున్నది ముసళ్ల పండగ

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణ కొనసాగుతుంది: గడికోట

విజయవాడ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): టిడిపి నేత చంద్రబాబు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. తమ ప్రభుత్వం రైతులకు న్యాయం చేసే దిశగానే ఆలోచిస్తోందని గురువారం నాడిక్కడ మీడియాతో శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దని రైతులను కోరారు. స్వార్థ రాజకీయాల కోసం ఆయన ఏమైనా చేయగల సమర్థుడని పేర్కొన్నారు. తన బినామీల ఆస్తులు కాపాడుకునేందుకు ఆయన నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. బాబుకు ముందుంది ముసళ్ల పండగ, తొందరపడొద్దంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇకపోతే చంద్రబాబు సవాల్‌ను స్వీకరించడానికి మా నాయకుడి వరకూ అవసరం లేదు. నేను గన్‌మెన్ లేకుండా వస్తా. ఎక్కడకు రావాలో చెప్పండి' అని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. 'పోలీసులు లేకుండా రండి' అని బాబు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కొట్టిపారేశారు. ఆయన భద్రత కోసం ఉన్న బ్లాక్ కమాండోస్‌కు నెలకు రూ.60 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. వాళ్లు లేకుండా బాబు తుళ్లూరులోనే కాదు, రాయలసీమ, ఉత్తరాంధ్రలోనూ ఎక్కడా తిరగలేరని ఎద్దేవా చేశారు.

బాబు,లోకేశ్‌లను కూడా జగన్ వద్దకు తీసుకెళతాం

టీడీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు రోజురోజుకూ దిగజారి ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. రైతులను పెయిడ్ ఆర్టిస్టులు అనడం సరికాదని హితవు పలికారు. సమస్యలు చెప్పుకొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజధాని రైతులు కలిశారని.. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తమది రైతు ప్రభుత్వం అని.. అడగకుండానే సీఎం జగన్ కౌలు పరిహారాన్ని 10 ఏళ్ల నుంచి 15 ఏళ్లకు పెంచారని పేర్కొన్నారు. రైతు కూలీల పెన్షన్‌ను రూ.2,500 నుంచి రూ.5 వేలకు పెంచారన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండగా.. పూలింగ్ పేరిట చంద్రబాబు బలవంతపు భూసేకరణ చేశారని.. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని కోసం 8648 ఎకరాలు అవసరమా అని ప్రశ్నించారు. వ్యవస్థలన్నింటినీ చంద్రబాబు భ్రష్టు పట్టించారని విమర్శించారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు.

నేషనల్ హైవే దగ్గర జయభేరి వాళ్లు అపార్మెంట్లు కట్టారు. అక్కడికి సమీపంలోనే ఈస్ట్ ఫేస్‌తో రైతులకు సంబంధించిన భవనాలు కడుతుంటే.. వాటి కారణంగా జయభేరి అపార్మెంట్లు అమ్ముడుపోవనే కారణంతో వాటిని రిజర్వు జోన్‌లో పెట్టారు. దానిని ఎత్తివేయాలని సీఎం జగన్‌ను కోరాం. రైతుల సమస్యల గురించి చెప్పడానికి వెళ్తే సన్న రైతు ద్రోహి అంటారా. రైతులను, రైతు కూలీలను పెయిడ్ ఆర్టిస్టులు అంటారా అని ఆర్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా... అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు.. తన ఇంటి దగ్గర బల్బుల కోసమని... ఉండవల్లి పంచాయతీ నుంచి రూ. 50 లక్షలు డ్రా చేయించారు. పేదల ఇళ్లకు కనీస విద్యుత్ సౌకర్యాలు కల్పించలేదు. రెఫరెండం పెట్టాలని ఇప్పుడు అడుగుతున్నారు. అసలు ఏయే అంశాలపై రెఫరెండం పెట్టాలో బాబుకు తెలియడం లేదు. రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. మీరు రైతు మిత్రలు అయితే... చంద్రబాబు, లోకేశ్ ఉండవల్లి ఎమ్మెల్యే వద్దకు, మంగళగిరి ఎమ్మెల్యే అయిన నా వద్దకు రండి.. మనందరం కలిసి సంబంధిత మంత్రితో మాట్లాడదాం. ఈ పరిస్థితికి మీరే కారణం అయినా.. రైతుల కోసం నేను కూడా మీతో పాటు ముఖ్యమంత్రిని కలుస్తా. సమస్యలపై దృష్టి సారించకుండా కేవలం రాజకీయాలు చేస్తూ గ్రామస్థాయి నేతలా చంద్రబాబు మాట్లాడుతున్నారఅని చంద్రబాబు తీరును ఆర్కే ఎండగట్టారు.

హీరో విజయ్ ఇంట్లో కొనసాగుతున్న ఐటి సోదాలు

భారీగా నగదు సంచులు స్వాధీనం

చెన్నై,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): హీరో విజయ్ ఇంట్లో ఐటీ అధికారులు దాదాపు రూ. 65 కోట్ల వరకు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. విలువైన బంగారంతో పాటు పెద్ద మొత్తంలో నగదు లభించినట్లు తెలుస్తోంది. ఇదంతా లెక్కతేలలేదని కూడా తెలుస్తోంది. హీరో విజయ్ ఇంట్లో బుధవారం నుంచి ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఈ సోదాలలో ఐటీ అధికారులకు ఊహించని విధంగా 10 బ్యాగుల డబ్బులు దొరికాయి. ఐటీ అధికారులు హీరో విజయ్‌కి చెందిన ఇళ్లు, బిగిల్ సినిమా నిర్మాణ సంస్థ ఏజీఎస్ కార్యాలయాలతో పాటు.. ఆ సినిమా ఫైనాన్షియర్ అన్బుచెలియన్ ఇంట్లో ఐటీ దాడులు జరిగాయి. బుధవారం నుంచి జరుగుతున్న ఐటీ దాడులు.. గురువారం కూడా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం హీరో విజయ్ ఓ సినిమా షూటింగ్‌లో ఉన్నారు. ఆయనను ఐటీ అధికారులు అక్కడే విచారించారు. విజయ్ హీరోగా నటించిన బిగిల్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా 250 నుంచి 300 కోట్ల వరకు వసూల్ చేసిందని ఇండస్ట్రీ టాక్. ఈ సినిమా కోసం విజయ్ రూ. 50 కోట్లు పారితోషికంగా తీసుకున్నారట. దాదాపు తొమ్మిది గంటలుగా హీరో విజయ్‌ను ఐటీ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో విషాద ఘటన

విషవాయువులు లీకై ఏడుగురు కార్మికుల మృతి

లక్నో,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): యూపిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. పైపులైన్‌లో విషవాయువు లీకైన ఘటనలో ఏడుగురు కార్మికులు మరణించారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సీతాపూర్ జిల్లాలో గురువారం ఉదయం వెలుగు చూసింది. సీతాపూర్ పట్టణంలోని కార్బెట్ ఫ్యాక్టరీ, యాసిడ్ పరిశ్రమలకు మధ్య ఉన్న గ్యాస్ పైపులైన్ నుంచి విషవాయువు లీక్ అయింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు కార్మికులు మరణించారు. మృతుల్లో ముగ్గురు బాలకార్మికులు కూడా ఉన్నారని సీతాపూర్ జిల్లా మెజిస్ట్రేట్ అఖిలేష్ తివారీ చెప్పారు. ఈ ఘటన తెలుసుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కార్మికుల మృతితో ఆ ప్రాంతంలో విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

రెపోరేటు యధాతథంగా ఆర్‌బిఐ సమీక్ష

షేర్ మార్కెట్లో ఊపు...ఎగబాకిన సెన్సెక్స్

ముంబై,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు ఆర్బీఐ కొత్త వ్యూహాన్ని అనుసరించనున్నది. రెపో రేటును మార్చకుండానే, రెపో రేటు 5.15గానే ఉంచింది. ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకువచ్చేందుకు ఈ ప్రణాళిక అనుసరిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. ద్రవ్యపరపతి కమిటీలోని ఆరుగురు సభ్యులు రెపో రేటు స్థిరీకరణను సమర్థించారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. రివర్స్ రెపో రేటును కూడా ఆర్బీఐ మార్చలేదు. 4.90 శాతం వద్దే రివర్స్ రెపో రేటు యధావిధంగా ఉంటుంది. రెపో రేటులో మార్పు లేని కారణంగా.. అది రియల్ ఎస్టేట్‌కు దోహదం చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. 2020-21 బ్జడెట్ ప్రవేశపెట్టిన తర్వాత తొలి మానిటరీ పాలసీ సమీక్ష ఇదే. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రెపో రేటు కనీసం అక్టోబర్ వరకు ఇలాగే ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇకపోతే ఆర్‌బీఐ పాలసీ విధానాన్ని ప్రకటించిన కొన్ని క్షణాల్లోనే దలాల్ స్ట్రీట్‌లో దీపావళి సందడి నెలకొంది. దాదాపు అన్ని రంగాలషేర్లు కొనుగోళ్లతో కళకళల్లాడాయి. సెన్సెక్స్ ఏకంగా 200 పాయింట్లు ఎగియగా, నిఫ్టీ 60 పాయింట్లు ఎగిసింది. తద్వారా నిఫ్టీ 12150 స్థాయికి చేరింది. ఉదయం నుంచీ కీలక వడ్డీరేట్లపై ఆర్‌బీఐ నిర్ణయంపై ఆసక్తిగా ఎదురు చూసిన ట్రేడర్లు, ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగారు. ముఖ్యంగా బ్యాంక్‌నిఫ్టీ భారీగా లాభపడింది. అలాగే రియల్ ఎస్టేట్‌రంగానికి ఊతమిచ్చేలా ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకోవడంతో పిరామల్, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్ సంబంధిత షేర్లు పుంజుకున్నాయి. ఆటో, ఆర్థిక రంగ షేర్లలో అనూహ్యంగా కొనుగోళ్లు పెరిగాయి. అలాగే ఫార్మా, మెటల్ ఇండెక్స్ లాభపడుతుండగా, ఒక్క ఎఫ్ఎంజీసీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. గెయిల్, జేఎస్‌డబ్ల్యూస్టీల్, యస్‌బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, జీ లిమిటెడ్ టాప్ విన్నర్స్‌గా ఉండగా హిందాల్కో, బీపీసీఎల్, టైటాన్, ఇన్ఫోసిస్, టాటా మోటర్స్ షేర్లు స్వల్పంగా నష్టపోతున్నాయి. కాగా ఆర్‌బీఐ పాలసీ రివ్యూలో రెపో రేటును 5.15 శాతంవద్ద, రివర్స్‌రెపో రేటును 4.90 శాతం వద్దే ఉంచుతూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది.

కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతి

మేడ్చల్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): కరెంట్ షాకకు ఓ రైతు బలయ్యాడు. శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగిశెట్టి పల్లి గ్రామంలో కరెంట్ షాక్ తగిలి ఆకుల ప్రసాద్ అనే కౌలు రైతు మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గురువారం ఉదయం బోరు బావి దగ్గరికి వెళ్లిన సమయంలో వైరు తగిలి కరెంట్ షాక్ కొట్టిందని స్థానికులు తెలిపారు. ప్రసాద్‌కు భార్య, కూతురు ఉన్నారు. శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఇంటర్‌సిటీకి బాంబు బెదరింపు

హైదరాబాద్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): విజయవాడ ఇంటర్ సిటి ఎక్స్ ప్రెస్ కు బాంబు బెదిరింపు రావడంతో రైలును కాసేపు ఆపేశారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టామని గురువారం ఉదయం 5.30 నిమిషాలకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. వెంటనే రైల్వే పోలీసులు అప్రమత్తమై రైలును నిలిపివేసి బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చ

శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో ముఖ్యం: మంత్రి ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్‌లో జిల్లాస్థాయి ఉద్యోగులు క్రీడలను ప్రారంభించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, ఫిబ్రవరి 6: క్రీడలు శారీరక దృఢత్వానికి ఎంతో ముఖ్యమని రాష్ట్ర రోడ్డు భవనాలు, గృహ నిర్మాణ శాఖామంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎప్పుడూ విధుల్లో ఉండి, అలసిపోయే ఉద్యోగులు.. క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతతను పొందుతారని తెలిపారు. 33వ డిస్ట్రిక్‌లెవెల్ ఇంటర్ డిపార్ట్‌మెంటల్ టీఎన్జీవోస్ స్పోర్ట్స్ మీట్‌లో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మంత్రికి గౌరవవందనం సమర్పించారు. మహాత్మ జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ విద్యార్థులు క్రీడల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో ఆదర్శవంతమైన పాలన

అభివృద్ధిని చూసి ప్రజలు ఆదరిస్తున్నారు
పార్టీలో చేరిన వారికి కండువా కప్పిన నోముల

నల్లగొండ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ ఆదర్శవంతమైన పాలనతో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య అన్నారు. అభివృద్ధి కెసిఆర్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని, అందుకే ఏ ఎన్నికలు వచ్చినా టీఆర్ఎస్ పార్టీకి అఖండ విజయాలు అందిస్తున్నారని అన్నారు. అధికార టీఆర్ఎస్ పార్టీలోకి ప్రతిపక్ష పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయి. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య సమక్షంలో వీరంతా టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోరులో ఎమ్మెల్యే నోముల నేతృత్వంలో హాలియా మున్సిపాలిటీని టీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. వీరి చేరిక సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా కెసిఆర్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతూ అభివృద్ధిలో ముందుంచారని అన్నారు. అన్ని ఎన్నికల్లోనూ టిఆర్ఎస్ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నదన్నారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ముఖ్యమంత్రి ప్రజల ఆకాంక్షను నెరవేర్చుతూ కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ ఇస్తూ సాగునీరు కూడా అందించి వ్యవసాయం పండుగలా మార్చిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. గ్రామాలు ఆదర్శవంతంగా ఉండాలన్న సదుద్దేశంతో ప్రజల భాగస్వామ్యంతో పల్లెప్రగతి చేపట్టారన్నారు. అభివృద్ధి టీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని, అందుకే ఎన్నికలు ఏవైనా టీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే రోజుల్లో మరింతో అభివృద్ధి చేసుకుందామని చెప్పారు.

. నల్లగొండ జిల్లా నిమడమనూరు మండలం సూరేపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిన దృశ్యం

ట్రంప్‌పై వీగిన అవిశ్వాసం ..తప్పిన పదవీ గండం

సెనేట్‌లో వీగిపోయిన రెండు తీర్మానాలు

వాషింగ్టన్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భారీ ఊరట లభించింది. ఆయనకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం వీగిపోయింది. దీంతో ట్రంప్‌కు పదవీ గండం తప్పింది. ట్రంప్‌ను సెనేట్ నిర్దోషిగా తీర్మానించింది. అధికార దుర్వినియోగం చేశారన్న అభియోగంపై ట్రంప్‌కు వ్యతిరేకంగా 48 ఓట్లు పడగా.. మద్దతుగా 52 మంది ఓట్లు వేశారు. అమెరికా కాంగ్రెస్ విధులకు ఆటంకం కలిగించారనే మరో అభియోగం 53-47 ఓట్ల తేడాతో వీగిపోయింది. దీంతో మొత్తంగా రెండు తీర్మానాలు సెనేట్‌లో వీగిపోయాయి. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు డెమొక్రటిక్ పార్టీ నేత జోయ్ బిడెన్ గట్టి పోటీ ఇస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన్ను దెబ్బ కొట్టేందుకు ట్రంప్.. ఉక్రెయిన్ సాయం తీసుకోవాలని ప్రయత్నించినట్లు ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉక్రెయిన్‌కు భారీగా ఆర్థిక సాయం చేస్తున్న ట్రంప్.. అందుకు ప్రతిఫలంగా డెమొక్రటిక్ నేత జోయ్ బిడెన్, ఆయన కుమారుడిపై అవినీతి కేసు దర్యాప్తును వేగవంతం చేయాలంటూ ఉక్రెయిన్‌పై ట్రంప్ ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో గతేడాది డిసెంబర్‌లో ప్రతినిధుల సభ ట్రంప్‌పై అభిశంసన అభియోగాన్ని మోపింది. డెమొక్రటిక్ అభ్యర్థులు ఎక్కువగా ఉన్న ప్రతినిధుల సభలో ఈ తీర్మానం ఆమోదం పొందగా..తాజాగా సెనెట్‌లో దీనిపై ఓటింగ్ జరిపారు. అధికార రిపబ్లికన్ సభ్యులు ట్రంప్‌కు మద్దతుగా నిలవడంతో.. ఆయనపై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం వీగిపోయింది. కాగా.. అభిశంసన తీర్మానం వీగిపోవడంపై రేపు అధికారికంగా స్పందిస్తానని ట్విట్టర్ వేదికగా ట్రంప్ ప్రకటించారు.



వ్యవసాయశాఖ కార్యదర్శిగా నియమితులైన జనార్ధన్ రెడ్డి గురువారం మంత్రి నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న దృశ్యం

చిలుకూరులో కరోనా పూజలు

రంగారెడ్డి,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ రాకుండా చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ , సౌందర్యరాజన్‌లు ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొన్నారు. పూజా నిర్వహణ అనంతరం తీర్థాన్ని భక్తులందరిపై చల్లారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ మాట్లాడుతూ.. దేశంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా చిలుకూరు బాలాజీ స్వామివారు ముందుంటారన్నారు. అవి రైతు ఆత్మహత్యలైనా, అత్యాచారాలైనా స్వామివారి ఆశీస్సులతో తాము పోరాడుతామన్నారు.

శవానికి గుండుగీసిన దుండగులు

సంగారెడ్డి,ఫిబ్రవరి6 (నేట నిజంప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో మృతదేహానికి గుర్తు తెలియని వ్యక్తులు గుండు గీశారు. పోచారం గ్రామానికి చెందిన వృద్ధురాలు చనిపోవడంతో క్రైస్తవ మత సంప్రదాయం ప్రకారం అత్యక్రియలు చేశారు. మూడు రోజుల తరువాత కుటుంబ సభ్యులు సమాధి వద్దకు వెళ్లగానే వెంట్రుకలు బయట కనిపించడంతో బయటకు తీసి చూడగా శవానికి గుండు గీసి ఉంది. దీంతో పటాన్ చెరు పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు.: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో మృతదేహానికి గుర్తు తెలియని వ్యక్తులు గుండు గీశారు. పోచారం గ్రామానికి చెందిన వృద్ధురాలు చనిపోవడంతో క్రైస్తవ మత సంప్రదాయం ప్రకారం అత్యక్రియలు చేశారు. మూడు రోజుల తరువాత కుటుంబ సభ్యులు సమాధి వద్దకు వెళ్లగానే వెంట్రుకలు బయట కనిపించడంతో బయటకు తీసి చూడగా శవానికి గుండు గీసి ఉంది. దీంతో పటాన్ చెరు పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు.

స్కూల్ విద్యార్థినిపై డ్రైవర్ అత్యాచారయత్నం

గమనించి దేహశుద్ధి చేసిన స్థానికులు

నెల్లూరు,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): విద్యార్థినిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలాన్ని రేపింది. నెల్లూరులోని విద్యా విహార్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే స్కూల్‌లో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్న శివ లైంగిక దాడికి యత్నించాడు. విషయాన్ని గమనించిన స్థానికులు శివకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం ఆగ్రహంతో స్థానికులు స్కూల్ వ్యాన్‌ను తగలబెట్టారు.

బృహదీశ్వరాలయంలో ఘనంగా కుంభాభిషేకం

చెన్నై,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): తంజావూరు బృహదీశ్వరాలయంలో మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో 23 ఏళ్ల తర్వాత మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు దేశవిదేశాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో తంజావూరు జనసంద్రంగా మారిపోయింది. బృహదీశ్వరాలయ ప్రధాన రాజగోపురంతో పాటు ఆలయ ప్రాంగణంలోని పలు దేవతామూర్తుల ఆలయ శిఖరాల పైనున్న స్వర్ణ, రజత, కాంస్య కలశాలకు సంప్రోక్షణ చేశారు. ఇందుకోసం యాగశాలలో ఉంచిన గంగా, యమున, కావేరి నదుల పవిత్ర జలాలున్న 705 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆస్తి కోసం దారుణం

పినతల్లి, చెల్లెలును దారుణంగా చంపిన దుర్మార్గుడు

సూర్యాపేట,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): సూర్యాపేట జిల్లాలో దారుణం జరిగింది. ఆస్తి కోసం ఓ వ్యక్తి ఘాతుకానికి ఒడిగట్టాడు. పినతల్లితో పాటు చెల్లెలిని దారుణంగా హత్య చేవాడా దుర్మార్గుడు. చెల్లి, పినతల్లి అత్యంత దారుణంగా కొడుకు హతమార్చిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. సూర్యాపేట మండలం తాళ్ల కాంపాడ్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. చెల్లెలు మౌనిక(22), పిన తల్లి కప్పల అంజమ్మ (45)ను కొడుకు కప్పల మహేష్ హత్య చేశాడు. మహేష్ తండ్రి నాగయ్యకు ఇద్దరు భార్యలు కాగా.. కుటుంబ ఘర్షణల నేపథ్యంలో మహేష్ ఈ హత్యలు చేసినట్టు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తుచేపట్టారు.

పౌరులే కేంద్రంగా పురపాలన: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 6: పురపాలన పూర్తిగా పౌరుల కేంద్రంగా జరగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాల కశాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. పురపాలకశాఖ కమిషనర్లు, కార్పోరేషన్ల కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మంత్రి నేడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... పురపాలనలో భాగంగా ప్రజలకు మరింత చేరువ కావాలని ఈ సందర్భంగా వారికి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పురపాలక చట్టాన్ని ప్రతి ఒక్క మున్సిపల్ కమిషనర్ తన విధి నిర్వహణలో జాబ్ చార్ట్ గా పరిగణించాలని కోరారు. పట్టణ ప్రజలు అధికారుల నుంచి అద్భుతాలలేమీ ఆశించడం లేదని, కేవలం వారి ప్రాథమిక అవసరాలు, పౌర సేవలందిస్తే సరిపోతుందన్న భావంతో ఉన్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఆదిశగా పని చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు. అధికార వికేంద్రీకరణే స్ఫూర్తిగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అదే స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని పరిపాలన ఫలాలు అందాలన్న లక్ష్యంతో గ్రామ పంచాయతీలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను కొత్తగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వికేంద్రీకరణ ఫలాలు ప్రజలకు అందాలంటే అధికారులు స్థానిక ప్రజలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

నూతన పురపాలక చట్టంలోని పారిశుద్ధ్యం, పచ్చదనం, పౌర సేవలు, పురపాలనలో అప్లైన్ సేవలు, టెక్నాలజీ వినియోగం, గ్రీవెన్స్ రిడ్రెస్సెల్, ఎలాంటి అవినీతికి తావులేకుండా భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం వంటి అంశాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పని చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఉదయం 4:30గంటలకే పట్టణ పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. దీంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టే ప్రయత్నం చేయాలన్నారు. పట్టణాలు, కార్పొరేషన్లలో సాధ్యమైనన్ని ఎక్కువ పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నం చేయాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా షీ టాయిలెట్ల నిర్మాణాన్ని కూడా పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. నూతన మున్సిపల్ చట్టం ప్రకారం పురపాలిక బడ్జెట్ లో కనీసం పది శాతంతో గ్రీన్ ప్రణాళిక రూపకల్పన చేయాలని, పట్టణంలో పచ్చదనం పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపకల్పన చేయాలన్నారు. ప్రతి పట్టణానికి శానిటేషన్ ప్లాన్ తో పాటు గ్రీన్ ప్లాన్ కూడా తయారు చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అవసరమైన హెల్త్ ప్లాన్ తయారుచేసి ఉంచాలన్నారు. ఇందుకోసం అవసరమైతే వెటర్నరీ డాక్టర్ లు, ఎంటవ రాలజిస్ట్ లు ఇతర సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు.

21 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు...

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన పౌరసేవలు అవినీతి రహితంగా, అత్యంత పారదర్శకంగా ఉండాలన్న స్ఫూర్తితో అనేక నూతన చట్టాలు చేస్తున్నదన్నారు. అందులో భాగంగా పురపాలకశాఖలో తీసుకువస్తున్న టీఎస్ బిపాస్ ద్వారా 21 రోజుల్లో ప్రజలకి భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాల్సిందేనని, ఇందులో ఎలాంటి రాజీ ఉండబోదని మంత్రి కేటీఆర్ తెలిపారు. పురపాలనలో అవినీతి అరికట్టేలా కఠినమైన చట్టాలు, విధానాలు రూపకల్పన చేస్తున్నామని, వీటి అమలులో కూడా అంతే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను ఇంత స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా ఏ అధికారైనా అవినీతికి పాల్పడినట్లు రుజువైతే సస్పెన్షన్ వంటి నామమాత్రపు చర్యలు కాకుండా విధుల నుంచి పూర్తిస్థాయిలో తొలగించే అత్యంత కఠినమైన చర్యలు కూడా తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. నూతన భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ అమలును హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా మానిటర్ చేస్తామని తెలిపారు.

పౌరుల భాగస్వామ్యాన్ని పెంచాలి....

పురపాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని, పౌరులతో సంబంధాలని పెంచుకునే విషయంలో మరింత చొరవ చూపించాలని కమిషనర్లను మంత్రి కేటీఆర్ కోరారు. ఇందుకోసం సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని వేదికలను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజలతో కలిసి పని చేస్తూ వారికి అపూర్వమైన సేవలందించి పట్టణాలపైన తనదైన చెరగని ముద్ర వేసే తీరుగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో తమందరికీ ప్రజలే అంతిమ బాస్ లు(యాజమానులు)లన్న విషయాన్ని గుర్తుంచుకొని, వారితో బాధ్యతయుతంగా ఉండాలన్నారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే అధికారుల ను, నాయకులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని కేటీఆర్ అన్నారు. పురపాలనలో రాష్ట్రంలోని అనేక మున్సిపాలిటీలు, వివిధ రంగాల్లో అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టాయని, దీంతో పాటు జాతీయ స్థాయిలోనూ పలు నగరాలు వినూత్న విధానాలతో ముందుకు పోతున్నాయని వీటన్నిటిని పరిశీలించి వాటి స్ఫూర్తిగా స్థానికంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశానికి పురపాల కశాఖ విభాగాధిపతులతో పాటు నూతన కార్పోరేషన్ల కమిషనర్లు, పురపాలక సంఘాల మున్సిపల్ కమిషనర్లు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది హాజరయ్యారు.

అంతకంతకూ పెరుగుతున్న కరోనా మృతులు

చైనాలో 560కి చేరిన మృతుల సంఖ్య
లక్షల్లో కరోనా వైరస్ బాధితులు
సరిహద్దులు మూసేస్తున్న పలు దేశాలు
వ్యాపార రంగాన్ని కుదేలు చేస్తున్న మహమ్మారి

బీజింగ్,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): చైనాలో రోజురోజుకు కరోనా వైరస్ విజృంభిస్తోంది. చైనాలో కరోనా వైరస్ బారినపడి ఇప్పటి వరకు 560 మంది మృతి చెందారు. హుబే రాష్ట్రంలో మరో 70 మంది చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. వైరస్ వ్యాప్తికి ప్రధాన కేంద్రమైన హుబేలో కొత్తగా 2,987 కేసులు నమోదు అయ్యాయి. దీంతో చైనాలో కరోనా వైరస్ బాధితుల సంఖ్య 27,378 దాటింది. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చైనా అధికారులు వెల్లడించారు. కరోనా వైరస్‌ను అరికట్టేందుకు 100 మిలియన్ డాలర్ల విరాళాన్ని మిరిండా గేట్స్ ఫౌండేషన్ ప్రకటించింది. వివిధ దేశాల్లో కరోనా వ్యాధి కేసులు 182కి పెరిగాయి. ఫిలిప్పైన్స్‌లో తొలి మరణం నమోదైంది. కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో ప్రపంచ దేశాలు అప్రమత్తమై నివారణ చర్యలు తీసుకుంటున్నాయి. చైనా నుంచి ఇండియాకు వస్తున్న వారికి ఆయా ఎయిర్ పోర్టుల్లో వైద్యులు స్క్రీనింగ్ చేస్తున్నారు. కరోనా వైరస్ వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను వైద్యులు.. ఐసోలేషన్ వార్డుల్లో ఉంచి అబ్జర్వేషన్ చేస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చైనా అధికారులు వెల్లడించారు.

కంటికి కనిపించని సూక్ష్మజీవి.. దాదాపు 150 కోట్ల జనాభాతో, 13.6 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో కళకళలాడే డ్రాగన్ సామ్రాజ్యాన్ని గడగడ వణికిస్తోంది! ఆరోగ్యపరంగానే కాదు.. ఆర్థికంగానూ కుంగదీస్తోంది. చైనా పొలిమేరలు దాటి 26 దేశాలకు విస్తరించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా పెను ప్రభావం చూపుతోంది. చైనాలో ప్లాంట్లు ఉన్న యాపిల్, ఎయిర్‌బస్‌లాంటి దిగ్గజ బహుళజాతి సంస్థలే కరోనా దెబ్బకు ఉత్పత్తిని తగ్గించాల్సిన పరిస్థితి. ఎన్నడూ లేనివిధంతగా.. అంతర్జాతీయస్థాయిలో పేరొందిన బహుళజాతి సంస్థలు చైనాలో తమ వ్యాపారాలను నిలిపివేస్తున్నాయి.

లక్షల్లో కరోనా వైరస్ బాధితులు

చైనాను వణికిస్తున్న కరోనా వైరస్.. మరో 26 దేశాల్లో డేంజర్ బెల్స్ మోగిస్తోంది. కరోనాతో చనిపోయిన వారి సంఖ్య 560కు చేరింది. ఇందులో చైనాలో చనిపోయిన వారే ఉన్నారు. చైనాలో ఇప్పటివరకు 24 వేల మందికి పైగా వైరస్ సోకిందని నిర్ధారించారు. వీరిలో 5 వందల మంది పరిస్థితి సీరియస్ గా ఉన్నట్లు చెబుతున్నారు. వైరస్ సోకిన వారితో సన్నిహితంగా ఉన్న మరో లక్షా 71 వేల మందిని అబ్జర్వేషన్ లో ఉంచారు చైనా అధికారులు. కరోనా వైరస్ సోకిన వారు లక్షల్లో ఉండవచ్చని అంతర్జాతీయ వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అప్పుడే పుట్టిన చిన్నారికి వైరస్ సోకినట్టు గుర్తించారు. డెలివరీకి ముందు ఆమె తల్లికి కరోనా ఉన్నట్టు నిపుణులు తేల్చారు. బీజింగ్ లోనూ రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు వుహాన్‌లో వెయ్యి పడకల హాస్పిటల్‌ను 10 రోజుల్లో నిర్మించిన చైనా సర్కార్ తాజాగా 13 వందల పడకలున్న మరో హాస్పిటల్‌ను నిర్మిస్తోంది. కరోనా వైరస్‌తో చైనా సరిహద్దు దేశాలు అలర్టయ్యాయి. నార్త్ కొరియా, రష్యా, మంగోలియా దేశాలు చైనాతో తమ సరిహద్దులను మూసేశాయి. 12 నగరాలు కరోనా వైరస్బారిన పడటంతో.. ఆ ప్రాంతాలకు చైనా ట్రావెల్ బ్యాన్ విధించింది.

విమానయానరంగంపై తీవ్ర ప్రభావం

వివిధ దేశాలు చైనాతో వాణిజ్య సంబంధాలను పునఃపరిశీలిస్తున్నాయి. ప్రపంచంలోని పలు దేశాలు చైనా నుంచి, చైనాకు విమానాల రాకపోకలపై నిషేధం విధించడంతో విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం పడింది. కేవలం కరోనా వైరస్ కారణంగా.. చైనా వృద్ధి రేటు గత ఏడాది ఉన్న 6.1 శాతం నుంచి ఈ ఏడాది 5.6 శాతానికి పడిపోతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి 0.2 శాతం మేర తగ్గుతుందని అంచనా. ప్రముఖ రేటింగ్స్ సంస్థ మూడీస్.. కరోనా కారణంగా ఈ త్రైమాసికంలో చైనా జీడీపీలో ఒక శాతం నష్టం వస్తుందని అంచనా వేసింది. పలు కంపెనీలు చైనాలో ఉన్న తమ ప్లాంట్లను తాత్కాలికంగా మూసేయడంతో కోట్ల మంది ఉపాధి కోల్పోతున్నారు. సేవారంగంలో కేవలం 5 శాతం మంది ఉద్యోగాలు కోల్పోయారనుకున్నా.. అది 2 కోట్ల మందికి సమానం అని చైనా ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రత్యక్షంగా ఉద్యోగాలు కోల్పోయేవారి సంగతి. వారిపై ఆధారపడి జీవించేవారి సంఖ్య కూడా కోట్లలో ఉంటుందని అంచనా. దీంతో చైనా ఆర్థిక పరిస్థితి ఊహించడానికే భయంగొలిపేలా తయారవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగంపై కరోనా వైరస్ దెబ్బ తీవ్రంగా పడుతోంది. కరోనా వైరస్ దెబ్బకు చైనాతోపాటు, ప్రపంచంలోని పలు దేశాలు పర్యాటక ఆదాయాన్ని భారీగా కోల్పోతున్నాయి. చైనాతో సరిహద్దు ఉండే దేశాలన్నీ తమ సరిహద్దులను మూసేసుకుంటున్నా కూడా.. ఆయా దేశాలకు వెళ్లడానికి పర్యాటకులు సాహసించట్లేదు. ఫలితంగా ఆ దేశాల ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడుతోంది. కరోనా వైరస్ వల్ల చైనా పర్యాటక రంగమే కాక. హాంకాంగ్ మకావు, మంగోలియా, దక్షిణ కొరియా, రష్యా, అమెరికా, సింగపూర్, థాయ్‌లాండ్, మలేసియా, ఇండోనేసియా, కంబోడియా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల పర్యాటకం కూడా తీవ్రంగా దెబ్బతింటోంది.

ఆహార ఎగుమతులపై ప్రభావం

రోనా వైరస్ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లోని సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులపై పడింది. చైనాలో కరోన్ వైరస్ ఉధృతంగా ఉండడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న ఆహార ఉత్పత్తులపై నిశిత పరిశీలన జరుగుతోంది. దాంతో అక్కడి నుంచి ఇక్కడి వ్యాపారులకు ఆర్డర్లు రావట్లేదు. దేశంలో రొయ్యల సాగులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా ఉంది. ఏపీలో ఉత్పత్తి చేసే వనామీ రకం రొయ్యలను జపాన్, అమెరికా, చైనా, యూరప్ తదితర దేశాలకు విశాఖపట్నం పోర్టు సహా వివిధ పోర్టుల ద్వారా ఎగుమతి చేస్తున్నారు.

చైనాలోని భారతీయుల రక్షణకు తీవ్రంగా కృషి చేస్తున్నామని భారత్‌లోని చైనా రాయబారి సున్ వెయ్ డాంగ్ తెలిపారు. కరోనా వైరస్ ముప్పు నేపథ్యంలో భారతదేశం తమ దేశంపై వాణిజ్య ఆంక్షలు విధించదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి స్వల్పకాలిక కష్టాలు తమ దేశ ఆర్థిక వ్యవస్థపై తాత్కాలిక ప్రభావం మాత్రమే చూపుతాయని.. దాన్ని ఎదుర్కొనే సమర్థ వ్యవస్థలు తమకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాలూ ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని విస్తరించుకోవాలని ఆకాంక్ష వెలిబుచ్చారు.

ఆత్మాహుతి దళాలను తయారు చేసే కేంద్రం

షాహీన్ బాగ్ ఉదంతంపై కేంద్రమంత్రి గిరిరాజ్ ఆందోళన
ఢిల్లీ ఎన్నికల తరవాత అణచివేతకు ఆస్కారం ఉందన్న ఓవైసీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి6(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో కొనసాగుతున్న ఆందోళనలు ఆత్మాహుతి దళాలను ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడుతున్నాయని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు.

షాహీన్‌బాగ్ వద్ద కొనసాగుతున్న నిరసనలు...ఖిలాఫత్ ఉద్యమంతో సమానమని, ఈ ఆందోళనలు దేశానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాయని మంత్రి ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో 50 రోజులుగా కొనసాగుతున్న నిరసనలు ఆత్మాహుతి దళాల ఉత్పత్తికి ఉపయోగిస్తున్నారని గిరిరాజ్ సింగ్ ట్విట్టర్ లో వ్యాఖ్యానించారు.

ఇదిలావుంటే షాహీన్‌బాగ్‌పై హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 50 రోజులుగా షాహీన్‌బాగ్‌లో కొనసాగుతున్న ఆందోళనలను అణచి వేసేందుకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్రం బలప్రయోగం చేయవ